వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్‌గా సుధీర్‌కుమార్

వర్ధన్నపేట, అక్టోబర్ 27: వర్ధన్నపేట మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా సుధీర్‌కుమార్‌ను నియమిస్తున్నట్లు మున్సిపల్ ప్రిన్సిపాల్ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది కాలంగా వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన జోనాను వరంగల్ మున్సిపల్ కార్యాలయానికి బదిలీ చేశారు. సుధీర్‌కుమార్‌ను పూర్తిస్థాయి కమిషనర్‌గా నియమిస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. సోమవారం ఆయన బాధ్యతలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

ధర్మారావుపేట వాసికి డాక్టరేట్

పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న రుక్సానా

ఖానాపురం, అక్టోబర్ 27: మండలంలోని ధర్మారావుపేటకు చెందిన మహ్మద్ రుక్సానా ఈ నెల 25న ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ కృష్ణ చైతన్య చేతులమీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఆమె యూనివర్సిటీ కామర్స్ విభాగంలో కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ అకౌంటింగ్ ప్రాక్టీస్ ఏ స్టడీ ఇన్ సెలెక్ట్ కంపెనీస్ అనే అంశంలో రిటైర్డ్ ప్రొఫెసర్ శంకరయ్య పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు గౌరవ డాక్టరేట్ పట్టా పొందారు. రుక్సానాను గ్రామస్తులు అభినందించారు.

స్కార్పియో ఢీకొని ఒకరి మృతి

మల్లయ్య (ఫైల్)

దుగ్గొండి, అక్టోబర్, 27: రోడ్డు దాటుతుండగా స్కార్పియో వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని గిర్నిబావి గ్రామంలో జరిగింది. ఎస్సై నీలోజు వేంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెల్పూరి మల్లయ్య(68) శనివారం రాత్రి 8.30 గంటలకు ఇంటి ఎదురుగా ఉన్న బూర్గుల రమేశ్ ఇంటికి వెళ్లాడు. తిరిగి తన ఇంటికి వచ్చేందుకు రోడ్డు దాటుతుండగా నర్సంపేట నుంచి వరంగల్ వెళ్తున్న స్కార్పియో వాహనం ఢీకొట్టడంతో ఎగిరి రోడ్డు పక్కనున్న చెట్ల పొదల్లో పడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు 108లో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భార్య సుశీల ఫిర్యాదు మేరకు స్కార్పియో వాహనం నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒక్క శాతం డీఏ ప్రకటన విచారకరం

చెన్నారావుపేట, అక్టోబర్ 27: రాష్ట్ర ప్రభుత్వం ఒక్క శాతం డీఏ ప్రకటించడం విచారకరమని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడు ఆంగోత్ భద్రయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 15రోజుల్లో బకాయి ఉన్న మూడు డీఏలను విడుదల చేస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందన్నారు. ప్రభుత్వం రెండు డీఏలైనా ప్రకటించాల్సి ఉండగా మోసం చేసిందన్నారు. నాయకులు ఉమాశంకర్, వెంకటేశ్వర్లు, కట్టస్వామి, కొమురయ్య, రవి, మంజుల, రాణి, వీరన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★హైదరాబాద్ & తెలంగాణ జిల్లాల్లోని ప్రముఖ టెలికాం టవర్ కంపెనీలో పనిచేయడానికి డిప్లొమా/ ITI చదివిన ఎలక్ట్రీషియన్లు కావలెను. ఫోన్: 9177333978.

WGL-NT-98842

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

నర్సంపేట: మాట్లాడుతున్న ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రజినీకాంత్

సంగెం : సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యమకారుల మండల ఫోరం కన్వీనర్ యాదగిరి

ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి

నర్సంపేట/ వర్ధన్నపేట/ సంగెం/ నెక్కొండ/ గీసుగొండ, అక్టోబర్ 27: ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఆ ఫోరం జిల్లా అధ్యక్షుడు నందగిరి రజనీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ సాంబారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని సిటిజన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఉద్యమకారులకు 250గజాల ఇంటి స్థలం, గుర్తింపుకార్డులు, పెన్షన్ రూ.25వేలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సాంస్కృతిక సారథిలో వెయ్యి మందికి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమబోర్డును ఏర్పాటు చేయాలన్నారు. వృద్ధకళాకారులకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర కోకన్వీనర్ వనం శ్రీనివాస్, రాజేరు, మల్లాడి వీరారెడ్డి, నర్మెట్ట యాదగిరి, బొట్ల పవన్, నమిండ్ల సురేష్, డాక్టర్ శ్రీనివాస్, సింగారపు సునీల్, నర్సయ్య, తిరుపతిరెడ్డి, తంగెళ్ల భాస్కర్, కుమారస్వామి, లింగమూర్తి, అశోక్, రాజు పాల్గొన్నారు. కాగా, వర్ధన్నపేటలో మండల పరిధి ఉద్యమకారుల సమావేశం జరిగింది. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కన్వీనర్ ఎండీ అన్వర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో పోలీస్ కేసుల పాలై ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. సమైక్య పాలకుల నిర్బంధంతో అనేక మంది ఉద్యమకారులు ప్రాణత్యాగాలు చేసుకునేందుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. పోలీసుల వేధింపులు, ఒత్తిళ్లను అధిగమించి ఉద్యమంలో పాల్గొన్నట్లు వివరించారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, రూ.10లక్షల ఆర్థికసాయం, నెలకు రూ.25వేల పింఛన్, ఆరోగ్యభద్రత కార్డులు జారీ చేస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచారని వివరించారు. ఆయా హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పులి శ్రీనివాస్, మహేశ్వరం వేణు, సమ్మెట యాదగిరి, జన్ను నర్సయ్య, మన్నూరు సోము, తిరుపతి సురేష్, లక్ష్మణ్, రాజునాయక్, బాలరాజు, ప్రభాకర్, ప్రవీణ్, వెంకటరమణ, కేదారి, చందూలాల్, చెన్న య్య, అశోక్, సాయన్న, కుమార్, మధు, సాగర్, శ్రీను పాల్గొన్నారు. సంగెం మండల తెలంగాణ ఉద్యమకారుల మండల ఫోరం కన్వీనర్ వేల్పుల యాదగిరి మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో 10శాతం కేటాయించాలన్నారు. రాజమల్లు యాదవ్, చిర్రి సునిల్, బోనాల యాదగిరి, బందెల అయిలయ్య, పోశాల ప్రభాకర్, ఏలియా పాల్గొన్నారు. నెక్కొండలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు కొత్త సంపత్‌రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లలో ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశం తీర్మానించింది. సంఘం మండల నాయకులు పొన్నాల కోమల్‌రెడ్డి, రవి, చీర చేరాలు, పరకాల భిక్షపతి పాల్గొన్నారు. ఉద్యమాలు మళ్లీ మొదలు కాకముందే కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని గీసుగొండకు చెందిన ఉద్యమకారుల సంఘం నాయకుడు ఆడెపు రమేశ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

వర్ధన్నపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ అన్వర్

ఎమ్మెల్యే దొంతి పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట రూరల్, అక్టోబర్ 27: మండలంలోని దాసరిపల్లిలో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన దాసరి తిరుపతిరెడ్డి తండ్రి దాసరి వెంకట్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే దొంతి పరామర్శించారు. తొలుత మృతుడు వెంకట్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్‌నాయక్, కోమాండ్ల ఆదిరెడ్డి, ముద్దం రాజేందర్, మధు, రాజు ఉన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కాశీబుగ్గ, అక్టోబర్ 27: రక్తదానంతో ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసినట్లేనని శ్రీపరివార్ ఆధ్యాత్మిక సేవా సంస్థ ట్రస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజేందర్ అన్నారు. ఆదివారం ఓ సిటీ రోడ్డులో గల శ్రీబీరన్నస్వామి దేవాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వందల మంది సాధకులు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. శ్రీపరివార్ సేవా సంస్థలో యోగ సాధన చేసిన సాధకులతోపాటు హనుమకొండ, నర్సంపేట సాధకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ సెక్రటరీ డాక్టర్ తిరుపతి, ఆలయ అధ్యక్షులు కంచ సంపత్, అల్లె సంపత్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

గీసుగొండ, అక్టోబర్ 27: మండలంలోని జాన్‌పాకకు చెందిన మహిళ బొందనపల్లి పద్మ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్ తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల్లో పీడీఎస్ బియ్యాన్ని సేకరించి తన ఇంట్లో నిల్వచేసింది. దాడి చేయగా 14 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. వాటి విలువ రూ.36,400 ఉంటుందని పేర్కొన్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి చర్యల కోసం గీసుకొండ పోలీసులకు కేసు అప్పగించినట్లు తెలిపారు.

విలువల రాజకీయాలకు దిక్సూచి ఓంకార్

ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి

నర్సంపేట, అక్టోబర్ 27: విలువలతో కూడిన రాజకీయాలకు దిక్సూచి మాజీ ఎమ్మెల్యే ఓంకార్ అని ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. ఆదివారం నర్సంపేటలో ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో ఓంకార్ 16వ వర్ధంతి సందర్భంగా చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం ముసుగులో సంపదను కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు కట్టబెడుతున్న పాలకులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. ఓంకార్ చూపిన మార్గంలో ప్రజలు నడవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ నాయకులు పెద్దారపు రమేశ్, గోనె కుమారస్వామి, హంసారెడ్డి, మంద రవి, నర్ర ప్రతాప్, గుండెబోయిన చంద్రయ్య, కుసుంబ బాబూరావు, వంగాల రాగసుధ, నాగెల్లి కొమురయ్య, గడ్డం నాగార్జున, సావిత్ర, రాజమౌళి, సదానందం, మల్లికార్జున్, యాదగిరి, జమున, నాగరాజు, మాషుక్, భాస్కర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గాదగోని రవి

పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

రూ.3లక్షల విరాళం ప్రకటించిన ఎస్ఆర్ఆర్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి, అక్టోబర్ 27: మండలంలోని మైలారం గ్రామంలో బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటు కోసం శ్రీరాజరాజేశ్వరి (ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్) ఫార్చూన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్స్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి రూ.3లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఆదివారం స్వగ్రామంలోని గౌడ కులస్తుల కోరిక మేరకు గ్రామంలోని ఊకల్ క్రాస్‌రోడ్డు వద్ద పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు ఆయన భూమిపూజ చేశారు. గ్రామస్తులు లేతాకుల రంగారెడ్డి, మహేందర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, కోల కొమురయ్య, రంగు కుమార్, లేతాకుల యాదవరెడ్డి, బిల్ల వెంకట్‌రెడ్డి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, గూడెల్లి వెంకన్న, కోల సంపత్ పాల్గొన్నారు. కాగా, మండలంలోని కాట్రపల్లికి చెందిన గాదరి యాకయ్య, కేశవాపురానికి చెందిన చిలుముల సోమయ్య, మహ్మద్ యాకూబ్‌పాషా కుటుంబాలకు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి క్వింటన్నర చొప్పున బియ్యం, నూనె డబ్బాలు, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఐరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎల్లయ్య, మొలుగూరి పున్నమయ్య, మల్లయ్య, రమేశ్, బాలునాయక్, శ్రీనువాస్, స్వామి, భాస్కర్, యాకయ్య పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్రస్థాయి ఆర్చరీకి ఆర్‌డీఎఫ్ విద్యార్థులు

పర్వతగిరి, అక్టోబర్ 27: మండలంలోని కల్లెడ కళాశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆడెపు జనార్ధన్ ఆదివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జేఎన్ఎస్‌లో నిర్వహించిన ఆర్చరీ పోటీల్లో ఆర్డీఎఫ్ విద్యార్థులు హాజరై ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. ఇండియన్ రౌండ్ విభాగంలో ఏ ప్రసన్న, బీ అశ్విత్, సీహెచ్ చరణ్, పీ వినయ్, త్రినయని, రికర్వ్ విభాగంలో బీ శ్రీకాంత్, సందీప్, అరవింద్ ఎన్నికైనట్లు వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజు, ఆర్చరీ కోచ్ రేణు మండల్ అభినందించారు.

పేదల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

రాయపర్తి, అక్టోబర్ 27: రాష్ట్రంలోని పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలానికి చెందిన 32 మంది లబ్ధిదారులకు రూ.8.80లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, పాలకుర్తి దేవస్థాన పాలక మండలి చైర్మన్ తిరుమల మాడభూషణ కృష్ణమాచార్యులు, మచ్చ నీలయ్య, మహ్మద్ మహమూద్ పాషా, మహేందర్‌రెడ్డి, కుంట రమేశ్, ఏసీ రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు. కాగా, మండలంలోని సూర్యతండాకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు హపావత్ పంతులునాయక్, మైలారం గ్రామానికి చెందిన మహ్మద్ మహమూద్‌పాషా తీవ్ర అనారోగ్య సమస్యలతో హనుమకొండలోని ప్రైవేట్ దవాఖానాల్లో చికిత్సపొందుతున్నారు. వారిని ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.

తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరం నూతన కమిటీ ప్రతినిధులు

ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుదాం

ఉద్యోగుల జేఏసీ చైర్మన్ రాంకిషన్

ఖిలావరంగల్, అక్టోబర్ 27: ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుదామని ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్ అన్నారు. ఆదివారం టీఎన్జీవోస్ భవనంలో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరం, వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులుగా తమ భాధ్యతను నెరవేర్చాలన్నారు. తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల నూతన కమిటీ అధ్యక్షుడిగా గుగులోత్ యాకూబ్‌నాయక్, కార్యదర్శిగా దయ్యాల సదానందం, సహాధ్యక్షుడిగా పోలు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులుగా సాధనపల్లి ధర్మేందర్, పీ కల్యాణి, ఎస్కే హుస్సేన్, కోశాధికారిగా ఆకుల పృథ్వీరాజ్, సహాయ కార్యదర్శులుగా నీలం వీరేశ్, భూక్య సుమన్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సోనాబియినా కిరణ్, పెంచాల విజేందర్‌ను ఎన్నుకున్నారు. టీఎన్జీవోస్ జిల్లా ప్రధానకార్యదర్శి గాజె వేణుగోపాల్, కేంద్ర కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు, ములుగ జిల్లా అధ్యక్షుడు పోలరాజు , జిల్లా కోశాధికారి పాలకుర్తి సదానందం, సహాధ్యక్షులు లావుడ్య మేమా నాయక్, శరత్, గణేశ్, రజిత, సందిళ్ల బలరాం, వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యుత్‌చార్జీలను పెంచే ఆలోచన విరమించుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న నామాల సత్యనారాయణ

నర్సంపేట రూరల్, అక్టోబర్ 27: విద్యుత్‌చార్జీలను పెంచే ఆలోచనను కాంగ్రెస్ ప్రభుత్వం విరమించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ అన్నారు. ఆదివారం పార్టీ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహ విద్యుత్ వినియోగదారులకు నెలకు 300 యూనిట్లు దాటితే యూనిట్‌కు రూ.10 నుంచి రూ.50కి పెంచే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. దీని వల్ల నెలకు రూ.15వేలకు మించి కరెంటు బిల్లు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కేసీఆర్ పాలనలో పదేళ్లలో ఒక్కసారి కూడా విద్యుత్ చార్జీలను పెంచలేదని గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చి 10నెలలు కాక ముందే కాంగ్రెస్ ప్రభుత్వం పెంచబోతోందని విమర్శించారు. వానాకాలం పంట సీజన్‌కు ఇవ్వాల్సిన రైతుబంధును కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిందన్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, క్లస్టర్ ఇన్‌చార్జీలు మోతె జయపాల్‌రెడ్డి, మోతె పద్మనాభరెడ్డి, కోమాండ్ల గోపాల్‌రెడ్డి, మచ్చిక నర్సయ్యగౌడ్, మోటూరి రవి, కొడారి రవన్న, కట్ల సుదర్శన్‌రెడ్డి, కడారి కుమారస్వామి, తాళ్లపెల్లి రాంప్రసాద్, భూక్య వీరన్న ఉన్నారు.

గడ్డిమందు తాగి ఆత్మహత్య

మోహన్ (ఫైల్)

సంగెం, అక్టోబర్ 27: మద్యం మత్తులో గడ్డిమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బాలునాయక్‌తండా జీపీ పరిధిలోని తోట్లతండాకు చెందిన మూడ్ మోహన్(40) మద్యానికి బానిసయ్యాడు. భార్య విజ్జి శనివారం వ్యవసాయ పనులకు రమ్మనగా ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో అతడిని మందలించి వ్యవసాయ పనులకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేనిది చూసి మద్యంమత్తులో ఇంట్లోని గడ్డిమందు తాగి పడుకున్నాడు. నోటి నుంచి నురుగులు వస్తుండగా పక్కింటివారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, 108లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ అతడు ఆదివారం మృతిచెందాడు. మృతుడికి తల్లి, భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి తల్లి రమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు.

జీపీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా యాకూబ్ నాయక్

పర్వతగిరి, అక్టోబర్ 27: తెలంగాణ గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఫోరం వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ఏనుగల్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి గుగులోత్ యాకూబ్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హనుమకొండలోని టీఎన్జీవోస్ భవన్‌లో సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా జాయింట్ కార్యదర్శిగా మండలంలోని రోళ్లకల్ జీపీ కార్యదర్శి భూక్య సుమన్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మండలంలోని బూరుగుమళ్ల జీపీ కార్యదర్శి కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వివరించారు.

భద్రతను పరిశీలించిన ఏసీపీ

వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 27: నరకాసుర వధ కార్యక్రమం జరిగే ఉర్సుగుట్ట కుడా మైదానాన్ని ఆదివారం వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ పరిశీలించారు. అక్టోబర్ 30న నిర్వహించనున్న నరకాసుర వధ ఉత్సవాల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి, కమిటీ సభ్యులు ఉన్నారు.

పేదరికాన్ని అంతం చేద్దాం

నర్సంపేట, అక్టోబర్ 27: పేదరికాన్ని అంతం చేద్దామని కవి, రచయిత కాసుల రవికుమార్ అన్నారు. ఆదివారం నర్సంపేటలో స్వేరోస్ ర్యాలీ ప్రారంభించారు. సిద్ధిపేటలో స్వేరోస్ నేషనల్ కన్వెన్షన్‌కు వారు బయల్దేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికాన్ని అంతం చేద్దామనే ఆలోచనతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వేరో నాయకులు రఘుపతి, ఇసాక్, శ్రీకాంత్, రాజేశ్, యశ్వంత్, రమేశ్, చందు, మహేశ్, సిద్ధు పాల్గొన్నారు.

బాలికల అప్పగింత

గిర్మాజీపేట, అక్టోబర్ 27: దేశాయిపేటలోని నూర్-ఈ-పూర్జాన్ మదర్సా హాస్టల్ నుంచి వెళ్లిపోయిన బాలికలను ఎస్‌పీఎఫ్ పోలీసులు ఆదివారం రాత్రి ఇంతెజార్‌గంజ్ పోలీసులకు అప్పగించారు. సీఐ ఎంఏ షుకూర్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీమాబాద్ బీరన్నకుంటకు చెందిన మసూద్-కౌసర్ దంపతుల కూతుళ్లు సానియామీర్జా, సనామీర్జా ఆదివారం రాత్రి ఎంజీఎం దవాఖాన వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఎస్‌పీఎఫ్ పోలీసులు ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. స్టేషన్ ఏఎస్సై సాంబయ్యను పంపగా బాలికలను ఏఎస్సైకి అప్పగించారు.

బాలుడి అదృశ్యం

చొప్పరి శ్రీరామ్

వర్ధన్నపేట, అక్టోబర్ 27: మండలంలోని దమ్మన్నపేటకు చెందిన బాలుడు అదృశ్యమైనట్లు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు, బాలుడి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చొప్పరి రాజేందర్ పెద్ద కుమారుడైన చొప్పరి శ్రీరామ్(15)ను మల్లకపల్లిలో చదివించాడు. అక్కడ సరిగా చదవడంలేదని నెల రోజుల క్రితం తీసుకువచ్చి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతిలో చేర్పించాడు. అయినా పాఠశాలకు వెళ్లపోవడంతో మందలించాడు. ఈనెల 25న పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రెండు రోజులైనా రాకపోవడంతో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి బీమా సొమ్ము అందజేత

సంగెం, అక్టోబర్ 27: మండలంలోని కుంటుపల్లికి చెందిన మిట్టపల్లి భాస్కర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, అతడు సభ్యుడిగా ఉన్న ఏకశిలా పురుషుల పొదుపు సంఘం అభయ నిధి ఇన్సూరెన్స్‌తోపాటు మొత్తం రూ.87,245లను మృతుడి తల్లి శాంతమ్మకు ఆదివారం అందజేశారు. సంఘం అధ్యక్షుడు కాగితాల జగన్నాథచారి, ఉపాధ్యక్షుడు చిర్ర మొగిలి, డైరెక్టర్లు ప్రకాశ్, చంద్రకాంత్, ఇంద్రయ్య, సురేందర్, వీరభద్రయ్య, రమేశ్, కుమారస్వామి పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

నెక్కొండ, అక్టోబర్ 27: మండలంలోని గుండ్రపల్లి రోడ్డుపై భారీ వాహనాల రాకపోకలతో గుంతలు పడి ప్రమాదకరంగా మారగా స్థానిక పోలీసులు ఆదివారం గుంతలను పూడ్చివేశారు. రైల్వే మూడో లైన్ పనుల కోసం చెరువుకట్ట పైనుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా రోడ్డు దెబ్బతిన్నది. ఎస్